‘వరి’గి పోతున్న రైతన్న

- గిట్టుబాటు ధర లేక వరి రైతు విలవిల
- కరుణించని కూటమి సర్కార్
- జాడలేని కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్న రైతన్నలు

నందవరం : కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వరి రైతులు ఒరిగి పోతున్నారు. గిట్టుబాటు ధర లేక విలవిలాడుతున్నారు. కనీస మద్దతు ధర లేక నష్టాలు మూట కట్టుకుంటున్నారు. కూటమి సర్కార్‌కు కనికరం లేకుండా పోయింది. రైతన్నలు ఆదుకునేందుకు కొనుగోలు కేంద్రాల జాడ కూడా లేకపాయే. చేసేదిలేక వచ్చిందే మహాభాగ్యం అన్నట్లు దళారుల చేతుల్లో అన్నదాతలు తమ ధాన్యాన్ని సమర్పించి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

1400 ఎకరాల్లో వరి సాగు..

నందవరం మండలంలో నది తీర ప్రాంతాలు, బోరు బావులు, ఎల్లెల్సీ కింద దాదాపు 1400 ఎకరాల్లో వరి సాగైంది. మండలంలో ఇప్పటి వరకు 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహారాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి కూటమి సర్కార్ ఒక గింజ కూడా వరి ధాన్యం కొనుగోలు చేయలేదు. పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతులు కోసిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు వసతి లేక కల్లాల్లోనే అమ్మేస్తున్నారు.


నాగలదిన్నెలో రోడ్డు మీద ఆరబోసుకున్న ధాన్యం


చిన్నకొత్తిలిలో ధాన్యాన్ని తరలించేందుకు మూటల్లో నింపుతున్న దృశ్యం

రైతులను దోచుకుంటున్న దళారులు

కూటమి సర్కార్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు దళారులు నిళ్లలోదిలేశారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడు రకానికి క్వింటా రూ.2,320, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,300కు కొనుగోలు చేయాలి. కానీ కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో దళారులు క్వింటా రూ.1,900 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల చాలా మంది రైతులు ధాన్యాన్ని అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు వరి ధాన్యంపై దందా సాగిస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి..

ఎకరా వరి సాగుకు రూ.35 నుంచి రూ. 45 వేలు ఖర్చు అవుతుంది. ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు మాత్రమే దిగుబడులు వచ్చాయి. ధర పతనం కావడంతో కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆరు గాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు అప్పుల ఊబిలో కూనరిల్లుతున్నారు. ప్రభుత్వం వరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

నివేదికలు పంపాం



ధాన్యం కొనుగోలు చేయాలని, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రైతులు ధాన్యాన్ని కల్లాలోనే ఆరబోసుకున్నారని ఉన్నాతాధికారులకు నివేదికలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ధాన్యాన్ని సేకరిస్తాం. తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకుంటాం.

– మర్రి స్రవంతి, ఏఓ, నందవరం

పెట్టుబడులు కూడా రావు



నేను 14 ఎకరాలు కౌలు తీసుకుని వరి సాగు చేశా. దాదాపు ఎకరానికి రూ.45 వేలు చొప్పున రూ.6.30 లక్షలు ఖర్చు అయింది. ప్రస్తుతం పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు. దళారులు క్వింటా రూ.1,900 కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరకు అమ్ముకుంటే కనీసం పెట్టుబడులు కూడా రావు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– నాగరాజు, వరి రైతు , నాగలదిన్నె

నష్టాలే మిగిలాయి



ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర ప్రకటించినా అమలు కావడం లేదు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ధాన్యం ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. నేను 11 ఎకరాలు కౌలు తీసుకుని వరి సాగు చేశా. పంట పండించిన ధాన్యానికి మద్దతు ధర లేక పోవడంతో నష్టాలను ముట్టగట్టుకున్నా. ఈ ఏడాది పెరిగిన పెట్టుబడులు, తగ్గిన ధరలతో రైతులంతా అప్పుల పాలయ్యారు.

– కురవ హనుమంతు, రైతు, గురజాల

క్లుప్తంగా

శాంతి కోసం పుష్పార్చన


శక్తిమాతకు పుష్పార్చన చేస్తున్న పూజారి

ఆదోని అర్బన్: పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన శక్తిమాతకు శుక్రవారం పుష్పార్చన పూజలు జరిగాయి. గత నెలలో పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి 28 మంది బలయ్యారు. వారి ఆత్మలకు శాంతి చేకూర్చాలని శక్తిమాతకు ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం పుష్పార్చన చేశారు. అదేవిధంగా ఉగ్రవాదులపై భారత సైనికుల దాడి విజయవంతం కావాలని శక్తిమాతకు పుష్పార్చన చేసినట్లు ఆలయ నిర్వాహకులు బిందే శంకర్ తెలిపారు.

చిరుతపల్లిలో మే డే వారోత్సవాలు


జెండా ఆవిష్కరణలో సీపీఎం నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో మేడే వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. సీపీఎం స్థానిక నాయకుడు నాగరాజు, సీనియర్ నాయకులు మల్లయ్య మాట్లాడుతూ కార్మిక దినోత్సవాన్ని ప్రతి కార్మికుడు జరుపుకోవాలన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలవల్ల నేడు శ్రామికునికి గిట్టుబాటు కూలి దొరకడం లేదని, అలాగే కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతన్నలకు కష్టాలు తప్పడం లేదన్నారు. రైతులను, కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, ఎల్లప్ప, ఉసేని, కేవీపీఎస్ నాయకులు చిన్న మారయ్య, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శివ కుమారుడు వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వాదించారు. అలాగే మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో గ్రామ సర్పంచ్ గోవిందు తమ్ముడి వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వాదించారు. ఆయన వెంట కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, నాయకులు పీఏ వెంకటరామిరెడ్డి, అబ్దుల్ సమద్, శివ, బాష, వడ్డె ఉసేని తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల : మండలంలోని గ్రామాల్లో సొంత ఇంటి స్థలం లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇంతకు ముందు ఇంటి స్థలం లేదా ఇంటి నిర్మాణం చేపట్టి ప్రభుత్వం నుంచి లబ్ధిపొంది ఉంటే అనర్హులన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు


పట్టణంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పారిశుధ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని పార్క్‌రోడ్, ట్యాంక్‌బండ్ రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలో ఎక్కడా పారిశుధ్యం లోపించకూడదని, సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిప్పగిరి: ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశానికి అన్ని ప్రైవేట్ పాఠశాలలు అవకాశం కల్పిస్తాయని తెలిపారు. ఇందుకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కగార్ ఆపరేషన్‌ను ఉపసంహరించుకోవాలి

ఆదోని రూరల్: కర్రిగుట్టల దాడిని, కగార్ ఆపరేషన్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి, సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారి సాయికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఆదోని అభివృద్ధి వేదిక కన్వీనర్ ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ అటవీ ఖనిజ సంపదలు ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతో ప్రధాని మోదీ ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్ మధ్య భారతాన్ని నెత్తుటి మడుగుగా మార్చుతోందన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ల దశను దాటి ఆదివాసులను నగ్నంగా ఊచకోత కోసే స్థాయికి చేరిందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప, పీఓడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మణి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఐఎఫ్‌టీయూ నాయకులు కుమార్, నారాయ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి


పెద్దకొత్తిలిలో పూలతోటను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం : రైతులు ఉద్యాన పంటల సాగు చేసేలా ప్రోత్సహించాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి ఎంపీడీఓ ఉపాధి పనులు, మస్టర్లు, ఉద్యాన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..రైతులు ఉద్యాన పంటలను సాగు చేయాలని, ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో పూలతోటలు, పండ్ల తోటలను ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే వేసవి దృష్ట్యా ఉపాధి పనులు ఉదయం పూటే పూర్తి చేసుకోవాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడబూరు : మండల ప్రజలు గుప్త నిధుల కోసం ఆలయాలు ధ్వంసం చేయడం లేదా పాడుబడ్డ బావులు, ఆలయాలలో తవ్వకాలు చేపట్టడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో శుక్రవారం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఈజీమనీ కోసం చాలామంది ఆశ పడుతున్నారన్నారు. అందులో భాగంగానే గుప్తనిధుల వేటలో పడ్డారన్నారు. ఇలా చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శివరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ పోరాటంతోనే కులగణన

ఎమ్మిగనూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన పోరాటంతోనే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దిగివచ్చి కులగణన చేపట్టబోతుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. దీంతో కులగణన చేసేందుకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు.

రేపు స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ

ఆదోని అర్బన్: ఈనెల 4న పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదోని అవోపా మరియు ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పుష్యమి నక్షత్రం రోజున (04-05-2025)న ఉదయం 7 గంటలకు అమూల్యమైన వెలకట్టలేని ఈ మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఔషధం పిల్లలో రోగ నిరోధకశక్తి, మేధాశక్తి, మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. 98494 78178 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రైల్వే గేటుకు ఇరువైపులా షెడ్లు ఏర్పాటు చేయాలి

కోసిగి: వేసవి కాలం కావడంతో ఎండలు విపరీతంగా పెరిగిపోయాయని, కోసిగి రైల్వే గేటు సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం గేటుకు ఇరువైపులా తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేసి ఎడ వేడిమి నుంచి ఉపశమనం కలిగించాలని సీపీఎం మండల కార్యదర్శి రాముడు, ప్రయాణికులు కోరారు. కోసిగి మీదుగా చెన్నై– ముంబాయి ప్రధాన రైల్వే మార్గం కావడంతో అనునిత్యం రైళ్ల రాకపోకలతో రద్దీగా ఉంటుందన్నారు. 15 నిమిషాల కొకసారి గేటు పడుతుందని, ఒక సారి గేటు వేస్తే రైలు వెళ్లి గేటు తెరిచి వరకు కనీసం 20 నిమిషాలకు పైగా వేచి ఉండాల్సి వస్తోందన్నారు. బైక్‌ల పై వెళ్లే ప్రయాణికులు వేసవి కాలం కావడంతో ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: పట్టణ సమీపంలో రామతీర్థంలో వెలసిన గాయిత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025 – 26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. 6వ తరగతిలో 100సీట్లుకు గానూ 271మంది దరఖాస్తు చేసుకోగా 265 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. వారిలో రోస్టర్ ఆధారంగా 130మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రంగన్న తెలిపారు. వారిలో స్థానిక బాలవికాస్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ఉమ్మి సలియా 74మార్కులతో నిలువగా, ఇతర పాఠశాలల విద్యార్థులు మేఘన 70 మార్కులతో రెండో స్థానం, సాయి ఈశ్వర్ 66 మార్కులతో మూడో స్థానంలో నిలిచారన్నారు.

- **గోనెగండ్ల :** ఏపీ మోడల్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ తెలిపారు. ప్రవేశ పరీక్షకు 288 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష రాసిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని, అలాగే ఫలితాలను పాఠశాల నోటీస్ బోర్డుపై కూడా అతికించడం జరిగిందని తెలిపారు. 100 సీట్లను మెరిట్ కం రోస్టర్ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు.

మోడల్ స్కూల్‌కు ఎంపిక

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని జేబీఎం ప్రాథమిక పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం రాజామౌళి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలల 5వ తరగతి చదువు పూర్తి చేసుకున్న కుర్లే అంకిత, పులికనుమ అంజలి, మంగలి మంజుల, పులుసు నరసింహా, ఎస్.శైలజ, ఉప్పర హర్షిత, కుమ్మరి మేఘన, కె. మహమ్మద్ ఉజైఫా, షేక్ తస్లీమ్‌లు అర్హత సాధించినట్లు చెప్పారు.

ఏడు నెలల గర్భిణిపై దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణి సత్యమ్మ

ఆదోని అర్బన్: మండలంలోని కపటి గ్రామానికి చెందిన సత్యమ్మ అనే ఏడు నెలల గర్భిణిపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు శుక్రవారం దాడి చేశారు. స్థలం విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకోగా రామిరెడ్డి, ఐమావతి, జయమ్మ, లక్ష్మితోపాటు మరో పది మంది తనపై దాడి చేశారని బాధితురాలు తెలిపింది. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు.

ధణాపురంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలి


ఎంవీఐ సిసిరాదీప్తికి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలో పాఠశాలల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)సిసిరాదీప్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లడుతూ ధణాపురం గ్రామంలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వందలాది మంది విద్యార్థులు చదవుకోడానికి వస్తుంటారన్నారు. కానీ అక్కడ బారికేడ్లు లేనందువల్ల వాహనాలు అతివేగంగా రావడంతో విద్యార్థులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందన్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించండి

ఆలూరు: అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలిచి విద్య, వైద్య, గృహ నిర్మాణాలకు చేయూతనిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ (ఆర్డీటీ) సేవలను కొనసాగించాలని ఎల్లార్తి గ్రామ సర్పంచ్ చాముండేశ్వరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు ఈరన్న ఆధ్వర్యంలో ఆర్డీటీ సేవలను కొనసాగించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె. గిరి మాట్లాడారు. గాదిలింగ, లక్ష్మన్న,వెంకటేష్ ఉన్నారు.

మండుతున్న ఎండలు

- వారం రోజులుగా 41 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రత
- బయటికి రావాలంటేనే జంకుతున్న జనం
- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


ఎమ్మిగనూరు రోడ్డులో రద్దీ లేకుండా నిర్మానుష్యంగా ఉన్న బసవేశ్వర సర్కిల్

ఆదోని సెంట్రల్: ఎండలు మండుతున్నాయి. వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9గంటలకే ఎండతీవ్రత పెరగడంతో బయటికి రావాలంటేనే జనం భయపడిపోతున్నారు. వారం రోజులుగా నియోజకవర్గంలో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలు నుంచి ఎండ వేడిమి తాళలేక జనాలు అల్లాడిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మున్ముందుఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. వివిధ పనుల మీద బయటకు వెళ్లే వారు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ఉపాధి, వ్యవసాయ పనులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం

గతేడాది కంటే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతవరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మే 12వ తేదీ వరకు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుంచి 55 డిగ్రీల వరకు పేరిగే అవకాశం ఉందని హెచ్చరించినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఏప్రిల్ మాసం చివరి వారంలో ఆదోని నియోజకవర్గంలో 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతవరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో వృద్ధులు, బాలింతలు, చిన్నారులు మధ్యాహ్నం పూట బయటకు రావద్దని, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఎండలో తిరగకూడదని సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

ఎండలో తిరిగితే శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. బాగా అలసి పోయినట్లు, నాలుక తడి ఆరిపోయినట్లు ఉండడం , విపరీతమైన తలనొప్పి ఏర్పడి, వాంతికి వచ్చినట్లు అనిపిస్తుంది. దీంతో మాట తడబడుతున్నట్లు అనిపిస్తుంది. ఒక్కోసారి కండరాలు పట్టేసినట్లు అనిపిస్తుంది. శరీరం తిమ్మిర్లు అనిపిస్తు ఉంటుంది. ఒక్కోసారి నీరసం వచ్చేసి ఎక్కడైనా వాలిపోవాలనిపిస్తుంది.

వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు

వడదెబ్బకు గురికాకుండా ఉండాలి అంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో తిరిగి వచ్చినపుడు, జ్వరం, నీరసం అనిపించినపుడు కొబ్బరి నీళ్లు లేదా ఓఆర్ఎస్ కలిపిన నీళ్లను తీసుకోవాలి. ఎక్కువ మోతాదులో మంచినీళ్లు తీసుకుంటే మంచిది. దోస, పుచ్చ, దానిమ్మ, అరటి వంటి పండ్లను తీసుకుంటే మంచిది. పండ్లతో పాటు పండ్ల రసాలు ఎక్కువగా తీసుకుంటే వేడి నుంచి ఉపశమనం పొందవచ్చు. బీపీ, షుగర్, గుండె జబ్బులకు మందులు వాడే వారిలో వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుంది కనుక వారు మరింత జాగ్రతగా ఉండాలి. తేలిక పాటి వ్యాయామాలు చేసుకోవాలి. మధ్యాహ్నం వేళల్లో ఇంటి పట్టున ఉంటే మంచిది.

తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది



ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఎక్కువగా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులుంటేనే మధ్యాహ్నం వేళ బయటకు రావాలి, లేకుంటే ఇళ్లలో ఉండడమే ఉత్తమం. బయట తిరిగే సమయంలో తలకు టోపీ లేదా గోడుగు, వదులుగా ఉండే దుస్తులు, కళ్లద్దాలు ధరించి వడగాలులు తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధి కూలీలతో పాటు అయా పనులు చేసుకుని జీవనం సాగించే వారు ఎండలో పని చేయడం వలన డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకొని పనులను చేయాలి.

– డాక్టర్ వినోద్ కుమార్, మెడికల్ ఆఫీసర్, ఆదోని అర్బన్ హెల్త్ సెంటర్

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

కర్నూలు(హాస్పిటల్): డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సునకు డిగ్రీ పాస్/ఫెయిలైన విద్యార్థులు కూడా అర్హులన్నారు. అభ్యర్థులకు 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సుండాలన్నారు. ఏడాది వ్యవధిగల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైఫండ్ ఇస్తామన్నారు. ఈ కోర్సు పూర్తయిన అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కోర్సులో చేరాలనుకునే వారు 93922 51434, 79950 13422 నంబర్లకు కాల్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు కర్నూలు నగరం జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ ఆవరణలో ఉన్న బొల్లినేని మెడిస్కిల్స్‌లో సంప్రదించాలని సూచించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

మద్దికెర : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ రవి తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతుల సమావేశంలో మాట్లాడారు. అన్నదాతలు తమ పొలాల్లో మట్టిని సేకరించి వ్యవసాయాధికారులకు అందజేస్తే పరీక్షించి ఫలితాలు అందజేస్తారన్నారు. వాటి ఆధారంగా ఏఏ పంటలు సాగు చేసుకోవాలి, ఎలాంటి ఎరువులు, మందులు వాడాలో తెలుస్తుందన్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు వీలవుతుందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com